మినీకథ

# సీసాలో నోటు

-చామర్తి దుర్గాప్రసాద్

సగాజుసీసాల్లో కాగితాలు (మెస్సేజెస్) పెట్టి వదలడం, ధనికుల సరదాల్లో ఒకటిట. అవి దొరికి అమాంతం అదృష్టవంతులయారట కొందరు.

రాజులకి నిద్రపట్టలేదు అది చదివి. అతని జీవితం అంతా అలాంటి అదృష్టం వేటలోనే జరిగిపోయింది. గుర్రప్పందేలు, బ్రాకెటు ఆట-ఇలా ఎన్నో. అన్నీ అయి అతను బికారిగా అయ్యాడు. అయినా అదృష్టం వేటమీద మజాపోలేదు. వేటకి పెట్టవలసిన కనీస ధనం లేకే ఆగిపోయ్యాడు.

ఇప్పుడు దొరికింది సముద్రం పక్కకిపోయి అదృష్టంవెదుక్కోవడమే. సహారా ఎడారిలో ఉంగరం ఎవరో పారేశారని తెలిసి వెదకడం లాంటిదే అయినా రాజులకి మాత్రం అలా అనిపించదు. అదేదో పెట్టి తెరిచి తీసుకోవడమే అని పిస్తుంది అతనికి

ముప్పైఏళ్ళ క్రితం అతనికి ఓటు హక్కు వచ్చింది. దాదాపు ఆరుసార్లు అతని ఓటుని వాడుకొన్నాడు. అదృష్టం మారుతుందేమో నని ఎదురుచూస్తూ, అతని బ్రాకెట్టు ఆటలాగానే ఈ ఎన్నికలు అతన్ని ముంచాయి అంటేఏమీ లేదు-అతని నుదుటి రేఖలో మార్పులేదనే.

కాయకష్టం చేసుకోకుండా ప్రభుత్వం మారితే మాత్రం నీ అదృష్టం మారుతుందా అని అతనికి "ఇంత గడ్డి పెట్టారు, ఎందరో. వాళ్ళంతా గూడా రాజుల్ని చూచి ఇవాళ అసూయపడుతున్నారు. మనం అనవసరంగా కష్టపడ్డాం పైకిరాలేదు వీడు కష్టపడలేదు. తెలివి గలవాడు"

అయితే రాజుల అదృష్టం పండింది. సీసా దొరికింది. ఎవరికీ తెలియకుండా అరణ్యంలోకి పోయి మారుమూల తెరిచి చూశాడు.

"డబ్బులేకపోయినా, నెరవేరగల డబ్బున్న వాళ్ళ సరదా ఏవా అని ఆలోచించాను. ఇలా తీర్చుకొంటున్నాను." అంతే, మరేమీ లేదు అందులో.

అన్ని పార్టీలు అలాంటి సీసాలు వదుల్తూనే ఉన్నవి. ఎటొచ్చీ సీసాలో ఆ మాత్రం నిక్కచ్చి సమాధానం గూడా ఉండడంలేదు.

రాజులు హతాశుడు కాలేదు. అతను 'చందమామ'లు చదివాడు. చదువుతున్నాడు. విసుగు చెందని విక్రమార్కుడు అతని ఆదర్శం.

భారతీయులందరూ విక్రమార్కులే. శవజాగరణ చేస్తున్నారు. అలసటే ఎరగరు ఇన్నేళ్ళబట్టి.

అదృష్టం రెండుసార్లు తలుపు కొట్టదని సామెత. రాజులకి మరోసీసా దొరకడం అందుకే వింత !

అరణ్యంలోకి పోకుండానే, ఆత్రంగా తెరిచి చూశాడు.

"గంట క్రితం ఒకసీసావదిలాను సరదా తీర్చుకోవడానికి, నాలాంటి ఏ పేదవాడో ఆశగా తెరిచి బాధపడగలడని తోచింది. అలాంటి బాధకి కారకుణ్ణి కనక నన్ను క్షమించాల్సింది. ఇంక ఎప్పుడూ ఇలాంటి తప్పుడు పనులు-ఆశలు కల్పించడం-చెయ్యను. గంటకే నాకు ఆశకురుపు లేచింది."

రాజులు బాధపడలేదు. అతనికి సంతోషం అయింది. అదృష్టదేవత ఎప్పుడూ తన్ని బాధపెడుతునే ఉంది. తన లాంటి పేదవాడిని గురించి ఆ మాత్రం ఆలోచించిన ఆ పేదవాడి హృదయం బంగారమై ఉండాలి; తన్ను గురించి ఎవరో ఎక్కడో ఆ మాత్రం ఆలోచించినందుకు అతనికి సంతోషం అయింది.

ఆ పేదవాడి పాటి ఆలోచించగల హృదయం ఎంతమంది నాయకులకు ఉంది?

ఎందు కుండాలి నాయకులకి? సీసాలమీద మోజుపడే మూర్ఖులున్నంత వరకూ-ఎందుకుంటుంది?

---

## "ఇదిలోకం"

-పి. ఆర్. భానుమూర్తి

ఇట జీవితమొక సమరం
ఎటు చూచినభీతావహతిమిరం
అనవరతం జీవితమిట పథవిహీన
పయనం
గమ్యమేదో తెలియని చీకటి విపినం
యిట కన్నుల కాంతి లేదు శాంతి లేదు
కుటిలత్వం-కాకుంటే కన్నీరులు
యిది లోకం-ముదిలోకం
హృదయాలను తొలిచేసే చెదపురుగుల
లోకం
మృతవీరుల ప్రతిశంఖం
కృతకపు చీకటి లోకపు చితిమంటల
సందోహం
వినిపించే దినమెప్పుడు?
కనిపించే క్షణమెప్పుడు?

## నిన్న రేపు

-చైతన్య

నిన్నంటే గతం గతం
గడిచిన యుగాల చరితం
భిన్నస్వరాల గతం స్వగతం
గతంలోకి తొంగిచూడు

రేపులోకి పయనించు
బీదవాని వెతలు చాటు
అయినవాని జరుగుబాటు
పీడితుని తిరుగుబాటు

మారుతున్న తీరుబాటు
నిన్నతల్లి రేపు పిల్ల
తల్లిపాటు తెలిసివుంటె
పిల్లబతుకు జిలుగు వెలుగు